అక్రమాలపై జిల్లా అధికారుల ఆరా..

ఈనాడు కథనానికి స్పందన

బయ్యారం, న్యూస్‌టుడే: బయ్యారం మండలంలో ఉపాధి హామీ పనులపై 'ఉపాధి బాటలో ప్రతి పనికో రేటు' శీర్షికన 'ఈనాడు'లో శుక్రవారం వెలువడిన కథనానికి జిల్లా స్థాయి అధికారులు స్పందించారు. సంబంధిత అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. వివిధ రకాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగికి షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశించినట్లు సమాచారం.

రూ.21,21,021తో అలంకరణ

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం దుర్గామాతకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో కన్యకాపరమేశ్వరి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మండపంలో శుక్రవారం రూ. 21,21,021 నగదుతో ప్రత్యేకంగా అలంకరించారు. మార్వాడి సత్రంలో దుర్గామాతకు ప్రత్యేక పూజలు చేశారు.

–నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే



జగన్మాతా పాహిమాం..!



జిల్లా కేంద్రంలోని మార్వాడి సత్రంలో..



ఇనుగుర్తిలో అమ్మవారి విగ్రహం వద్ద ఉత్సవాలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరుడు



పెద్దముప్పారంలో ..

జిల్లాలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటున్నారు. దేవాలయాలు, మండపాల్లో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం భక్తజనం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో తన్మయం చెందుతున్నారు. శుక్రవారం అమ్మవారు గాయత్రీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

–న్యూస్‌టుడే బృందం



దోర్నకల్‌లోని మణికంఠ ఫ్యాషన్ హబ్ మండపంలో....



బయ్యారంలో..



దోర్నకల్‌లోని వాయుసేన యూత్ మండపంలో...

అభయ హస్తం.. కాటమయ్య రక్షణ కవచం

మరిపెడ, న్యూస్‌టుడే: కల్లుగీత కార్మికుల రక్షణకు కాటమయ్య రక్షణ కవచం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కిట్లు అందజేస్తుందని ఎంపీ పోరిక బలరాం నాయక్, శాసనసభ్యుడు డాక్టర్ రామచంద్రునాయక్ అన్నారు. గీత కార్మికులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆరు పరికరాలతో కూడిన కాటమయ్య రక్షణ కిట్లను మరిపెడలో శుక్రవారం పంపిణీ చేశారు. గీత కార్మికుల సంరక్షణకు గత ప్రభుత్వం ఈ తరహా రక్షణ పరికరాలు అందించినా పెద్దగా ప్రయోజనం చేకూరలేదన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో పెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం అత్యాధునిక పద్ధతుల్లో కాటమయ్య రక్షణ కవచాన్ని తయారు చేయించినట్లు పేర్కొన్నారు. ఈ కిట్లు గీత కార్మికుల రక్షణకు దోహదపడతాయని ప్రభుత్వం భావిస్తోందన్నారు. మరిపెడ మండలం చిల్లంచర్లలో నిర్వహించిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ బలరాంనాయక్, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రునాయక్ పాల్గొన్నారు. మత్స్యపారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఈ సందర్భంగా నాయకులు అన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న బలరాం నాయక్

సంక్షేమ పథకాలు అందించాలని వినతి

మహబూబాబాద్: కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న గీత కార్మికులకు ప్రభుత్వ పథకాలు అందించాలని కోరుతూ శుక్రవారం తెలంగాణ గీత పనివారల సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ కిరణ్‌కు వినతి పత్రం అందించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు దొంతు రామ్మూర్తి, ప్రధానకార్యదర్శి చిర్ర వెంకటేశ్వర్లు, కోశాధికారి నక్క నాగార్జున తదితరలున్నారు.

విలీన గ్రామాలకు వరం.. అమృత్ 2.0

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్ పురపాలక సంఘంలో విలీనమైన గ్రామాలకు అదనంగా నీటి సరఫరా చేసేందుకు అమృత్ 2.0 పథకంలో ప్రారంభించిన పనులు త్వరగా పూర్తయితే ఆ ప్రాంతాలకు నీటి సమస్య తీరనుంది. రాబోయే 30 ఏళ్లలో పెరుగుతున్న జనాభాకు సరిపడా తాగునీటి అవసరాలను తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పురపాలక సంఘాల్లో అమలు చేస్తున్న 'అమృత్ 2.0' ఆ ప్రాంతాలకు వరంగా మారనుంది. ఇప్పటికే పూర్వ పట్టణంలో అసంపూర్తిగా నిలిచిపోయిన మిషన్ భగీరథ పనులను పూర్తి చేసి అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ ప్రభుత్వం రూ. 20 కోట్లు మంజూరు చేయించారు. దీనికి తోడుగా విస్తరించిన విలీన గ్రామాల్లోని అన్ని ప్రాంతాలకు నీటిని సరఫరా చేసేందుకు ఈ పథకం ద్వారా రూ. 28.45 కోట్లు మంజూరయ్యాయి. వీటిలో ఇతర వ్యయాలు పోనూ రూ. 20.95 కోట్లతో చేపట్టనున్న ఈ పనులకు గత నెలలో ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు కలిసి శంకుస్థాపన చేశారు. పనులను వేగవంతంగా పూర్తి చేస్తే జిల్లా కేంద్రంలో తాగునీటి సమస్య తీరనుంది.

ప్రయోజనమిలా..

గత ప్రభుత్వం మంజూరు చేసిన మిషన్ భగీరథ పథకంలో అప్పటి పూర్వ ఆరు పంచాయతీల్లో పైపులైన్, ఓవర్ హెడ్ ట్యాంకల నిర్మించారు. అన్ని ప్రాంతాల్లో పనులు చేయలేదు. ఈ ఐదేళ్ల కాలంలో విలీన గ్రామాలు విస్తరించి జనాభా పెరిగింది. వారి అవసరాలను గుర్తించి మిగిలిన పనులను పూర్తి చేసేందుకు అధికారులు అమృత్ 2.0 పథకానికి ప్రతిపాదనలను పంపిస్తే నిధులు మంజూరయ్యాయి. అవసరమైన ఓవర్ హెడ్ ట్యాంకలు, పైపులైన్ల నిర్మాణం చేపట్టి వీటికి పాత ట్యాంకులు, పైపులైన్లు అనుసంధానం చేసి నీటి సరఫరా చేస్తారు.



పట్టణంలో మరో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం కోసం తవ్విన కందకం

చేపట్టనున్న పనులు
ఓవర్ హెడ్ ట్యాంక్‌లు: 3
ప్రధాన పైపులైన్: 22.25 కి.మీ.
డిస్ట్రిబ్యూషన్ లైన్: 10 కి.మీ.
నల్లా కనెక్షన్లు: 2,800

విలీన గ్రామాలకు రోజు నీటి సరఫరా ఇలా.. (ఎంఎల్‌డీ)
సరఫరా చేయాల్సినది: 1.90
సరఫరా చేస్తున్నది: 1.60
అదనంగా సరఫరా చేయాల్సింది: 0.30

ఓవర్ హెడ్ ట్యాంక్‌ల నిర్మాణమెక్కడంటే..

☛ పట్టణంలోని నాలుగు, ఐదు వార్డులకు నీటిని సరఫరా చేసేందుకు పట్టణంలోని నర్సంపేట-ఇల్లందు బైపాస్ రోడ్ సమీపాన ఉన్న గ్రీన్‌లాండ్‌లో 600 కిలోలీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేసి ఇప్పటికే గ్రామాల్లో ఉన్న ట్యాంకులకు ఈ పైపులైన్ అనుసంధానం చేసి ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తారు.

☛ పట్టణంలోని ఏడో వార్డు పరిధిలో ఉన్న సాలార్ తండా, బేతోలు, రజాలిపేటకు నీటిని అందించేందుకు సాలార్ తండాలోని గుట్టపై 500 కి.లీ. సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేసి నీటిని అందిస్తారు.

☛ పట్టణంలోని ఒకటో వార్డు పరిధిలోని ఈదులపూసపల్లి గ్రామంతో పాటు భవిష్యత్‌లో విస్తరించనున్న అంబేడ్కర్ కాలనీ నుంచి ఈదులపూసపల్లి వరకు నిర్మాణమయ్యే ఇళ్లకు నీటిని సరఫరా చేయడం కోసం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో 500 కి.లీ. సామర్థ్యం కలిగిన ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేబట్టనున్నారు.

☛ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని వర్షాల వల్ల నిలిచిన పనులను త్వరగా పూర్తి చేయించి నీటి సమస్యను పరిష్కరించనున్నట్లు కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్ తెలిపారు.

శాస్త్రీయ విద్యా విధానానికి పోరాటం



మాట్లాడుతున్న ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు బూర్గుల ప్రదీప్

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: నూతన ప్రజాస్వామిక విప్లవ అవగాహనతో శాస్త్రీయ విద్యావిధానం, సమాన అవకాశాల కోసం సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఐఎఫ్‌టీయూ జాతీయ ఉపాధ్యక్షుడు బూర్గుల ప్రదీప్ అన్నారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) ఏర్పడి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం మహబూబాబాద్‌లోని గిరిజన భవన్‌లో పీడీఎస్‌యూ అర్ధశతాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముందుగా పీడీఎస్‌యూ జెండాను ఆవిష్కరించి విద్యార్థి ఉద్యమంలో అమరులైన వారికి నివాళులర్పించారు. అనంతరం ప్రదీప్ మాట్లాడుతూ.. 50ఏళ్ల పోరాటంలో విద్యా రంగ సమస్యల పరిష్కారానికి పోరాడుతున్నట్లు తెలిపారు. కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పూర్వ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్ మాట్లాడుతూ.. విప్లవ ప్రస్థానంలో అనేక మంది పీడీఎస్‌యూ విద్యార్థులు ప్రాణ త్యాగం చేశారన్నారు. వారి ఉద్యమ స్ఫూర్తితో సమ సమాజ నిర్మాణానికి విద్యార్థి ఉద్యమాలు నిర్వహించాలన్నారు. రాష్ట్ర పూర్వ నాయకుడు బాలాస్టి రమేష్, టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి మైస శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, పీడీఎస్‌యూ పూర్వ నాయకులు మండల వెంకన్న, గౌని ఐలయ్య, బండారి ఐలయ్య, మామిడాల సత్యనారాయణ, కొమిరె వెంకన్న, సోమ విష్ణువర్ధన్, రాష్ట్ర అధ్యక్షుడు బి.మధు, జిల్లా అధ్యక్షుడు నాగరాజు, లింగన్న, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

బీమా సౌకర్యం కల్పించాలి

కేసముద్రం: కేసముద్రం మార్కెట్ కార్మికులకు మార్కెట్ ఆదాయం నుంచి బీమా సౌకర్యం కల్పించాలని కోరుతూ శుక్రవారం ఏఐసీటీయూ ఆధ్వర్యంలో మార్కెట్ ఎదుట ధర్నా నిర్వహించారు

కాంగ్రెస్ సీనియర్‌నేత నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత

వివరాలు 6లో..

రైతు ధర్నా విజయవంతం..

భారాస శ్రేణుల్లో ఉత్తేజం

తొర్రూరు, న్యూస్‌టుడే: ఎలాంటి షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేయాలని భారాస నేతలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలోని అమ్మాపురం క్రాస్ రోడ్డు వద్ద శుక్రవారం నిర్వహించిన రైతు మహాధర్నా విజయవంతం కావడం ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. వేలాదిగా తరలివచ్చిన రైతులతో ధర్నా ప్రాంగణం కిక్కిరిసి పోయింది. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన ధర్నాలో ముఖ్య అతిథిగా మాజీమంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ధర్నాలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు అమలుచేయాల్సిందేనని స్పష్టం చేశారు. అనంతరం ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ కీలక నేతలు ప్రసంగించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, వేదికపై పార్టీ నాయకులు



సభకు హాజరైన రైతులు

☛ రైతులకు ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరానికి రూ.15 వేలు రైతు భరోసా, వరి ధాన్యానికి రూ.500 బోనస్ అంటూ బోగస్ మాటలు చెప్పిన మోసకారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. 11 పర్యాయాలు రూ.72 వేల కోట్ల రైతుబంధును అందించిన ఘనత భారాస ప్రభుత్వానికే దక్కుతుంది.

- పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జనగామ ఎమ్మెల్యే

☛ తొర్రూరులో గురువారం ఓ వస్త్ర దుకాణం ప్రారంభోత్సవంలో వేదిక కూలిపోయిన మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టిస్తున్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసే వరకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటపడి వేటాడుతాం.

- స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాసరెడ్డి

☛ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తుంగలో తొక్కి రాష్ట్రంలో దుర్మార్గ పాలన కొనసాగిస్తున్నారు. రుణమాఫీపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, సీఎం రేవంత్‌రెడ్డిలు పొంతనలేని లెక్కలు చెబుతున్నారు. ఈ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు.

- శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

☛ నేటికి 30 శాతం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి బ్రోకర్ మాటలు చెబుతూ ప్రజలను మోసం చేస్తున్నారు. తొర్రూరులో 100 పడకల ఆసుపత్రి, పాలకుర్తిలో 50 పడకల ఆసుపత్రి పనుల ఊసేలేదు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ప్రభుత్వంపై పోరాడుతూనే ఉంటాం.

- మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: జిల్లాలో డీఎస్సీ-2024 ఉపాధ్యాయుల నియామకం కోసం 1:3 నిష్పత్తిలో సెకండరీ గ్రేడ్, స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో కొనసాగుతోంది. సెకండరీ గ్రేడ్ 381 మంది, స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు 960 మంది అభ్యర్థులకుగాను శుక్రవారం వరకు 798 మంది ధ్రువపత్రాలను పరిశీలించారు. 162 మంది అభ్యర్థులు ధ్రువపత్రాలను చూడాల్సి ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి వి.రాజేశ్వర్ తెలిపారు. శనివారం సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే పరిశీలించనున్నట్లు తెలిపారు. 1:3 ప్రకారం సందేశం వచ్చిన అభ్యర్థుల ధ్రువపత్రాలు మాత్రమే పరిశీలిస్తామన్నారు. కార్యక్రమంలో ఏసీజీఈ శ్రీరాములు, డీఎస్ఓ అప్పారావు,. కార్యాలయ సూపరింటెండెంట్ ఉమామహేశ్వర్, కో-ఆర్డినేటర్లు విజయకుమారి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న అధికారులు


సమస్యల పరిష్కారమే ధ్యేయం

నెల్లికుదురు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యలు పరిష్కరించడం, వాటి పరిష్కారం కోసం పోరాటాలు చేయడమే సీపీఎం ఎజెండాని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మునిగలవీడులో సీతారాం ఏచూరి నగర్‌లో శుక్రవారం పార్టీ గ్రామ శాఖ మహాసభను నిర్వహించారు.

ఆర్టీసీలో మహాలక్ష్మి!



● సంస్థ అభివృద్ధిలో కీలకపాత్ర



డిపోల వారీగా ● మహిళా కండక్టర్లు, ● సిబ్బంది

డిపో	మహిళా కండక్టర్లు	సిబ్బంది
వరంగల్ 1	48	04
వరంగల్ 2	71	04
హనుమకొండ	112	04
జనగామ	55	01
నర్సంపేట	57	03
మహబూబాబాద్	28	02
పరకాల	37	04
భూపాలపల్లి	27	–
తొర్రూరు	43	05
ఆర్.ఎం కార్యాలయం	01	05

హనుమకొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే

ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల బాట పట్టింది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆదాయం రెట్టింపయ్యింది. అధికారులు సంస్థను అభివృద్ధిలోకి తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేస్తున్నారు. వరంగల్ రీజియన్ పరిధిలో ఉత్తమ సేవలతో పాటు మంచి లాభాలు ఆర్జించడంలో మహిళా ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారు. కండక్టర్ నుంచి ఉన్నతాధికారుల వరకు అన్ని విభాగాల్లో సత్తా చాటుతున్నారు.

ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది డిపోల పరిధిలో మహిళా కండక్టర్లు 479 మంది ఉన్నారు. ఇతర విభాగాల్లో పని చేసే వారు మరో 32 మంది ఉంటారు. వీరిలో ప్రధానంగా వరంగల్ 2, జనగామ, తొర్రూరు, నర్సంపేట డిపో మేనేజర్లు జ్యోత్స్న, స్వాతి, పద్మావతి, ప్రసూనలక్ష్మి, వరంగల్ 2 డిపో అసిస్టెంట్ మేనేజర్ జ్యోత్స్న, హనుమకొండ డిపోలో నాజియా, ఆర్ఎం కార్యాలయంలో సరస్వతి, పరకాలలో కృష్ణకుమారి, నర్సంపేటలో భవానీ, తొర్రూరులో రజిత, ఎంఫ్‌లు వరంగల్ 2 డిపోలో అమల, పరకాలలో రాజశ్రీ, ఆర్ఎం కార్యాలయంలో మహితలు కీలక పదవుల్లో ఉండి ఆర్టీసీ అభివృద్ధికి కృషి చేస్తున్నారు.



మహిళా శక్తి ఇలా..

● పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఎక్కువ మంది మహిళా కండక్టర్లే విధులు నిర్వహిస్తున్నారు.

● ఆర్టీసీలో కార్మికులు తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఉన్నతాధికారులు ప్రతి డిపోకు ఇద్దరు సభ్యులతో కూడిన సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో ఉమ్మడి జిల్లాలోని 9 డిపోల్లో ఒక పురుషుడితో పాటు ఒక మహిళ సభ్యులుగా ఉన్నారు. తొర్రూరు, పరకాల, వరంగల్ 2, జనగామ డిపోల్లో ఇద్దరు సభ్యులు మహిళలే ఉన్నారు. వీరు డిపోల స్థాయిలో కార్మికులు, సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను డీఎం, ఆర్ఎంలకు చేరవేసి వాటి పరిష్కారం దిశగా కృషి చేస్తున్నారు.

● రీజియన్‌లో మహిళా సిబ్బంది విశ్రాంతి తీసుకునేందుకు ప్రతి డిపోలో ప్రత్యేకంగా విశ్రాంతి గదులను ఏర్పాటు చేశారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి డిపోలో ఇద్దరు సహాయకులు సైతం ఉంటారు. వీరు మహిళా సిబ్బందికి వారానికి, నెలకోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ అవసరమైన వారికి హనుమకొండలోని డిస్పెన్సరీ నుంచి మందులు, తార్నాకలోని ఆర్టీసీ ఆసుపత్రిలో అధునాతన చికిత్స అందించేలా కృషి చేస్తున్నారు.



వరంగల్ 1 డిపోలో మహిళల కోసం ఏర్పాటు చేసిన విశ్రాంతి గది

ఈ సేవలు అందిస్తే మేలు

- రోజుకు 8 గంటల పని దినం కల్పించాలి
- రాత్రి 8 గంటల వరకు తప్పని సరిగా విధులు ముగిసేలా చర్యలు తీసుకోవాలి.
- ప్రతి నెలా ఆరోగ్య సమస్యలకు మూడు రోజుల పాటు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలి.
- పని ఒత్తిడి నివారణకు సిబ్బంది, బస్సుల సంఖ్యను పెంచాలి.
- సిటీ బస్సుల్లో మాదిరిగా స్టాండింగ్ అలవెన్స్‌లు అందించాలి.
- స్పెషల్ ఆఫ్ డ్యూటీ (ఒక రోజు విధులు నిర్వహిస్తే మరో రోజు సెలవు వచ్చేలా) విధులు కేటాయించాలి.

ఉన్నతాధికారుల సహకారంతో ..



- జ్యోత్స్న, డిపో మేనేజర్, వరంగల్ 2

ఆర్టీసీ ఉన్నతాధికారుల ప్రోత్సాహంతో డిపో అభివృద్ధికి కృషి చేస్తున్నాం. వారి సూచనలను ఎప్పటికప్పుడు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నాం. మహిళా సిబ్బంది పురుషులతో సమానంగా విధులు నిర్వహిస్తూ డిపో అభివృద్ధికి పాటు పడుతున్నారు.

సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్నాం.



- బి.సుధారాణి, కండక్టర్ వరంగల్ 1

మహాలక్ష్మి పథకం వచ్చాక బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. దీంతో కొంత ఒత్తిడితో పాటు అనారోగ్యానికి గురవుతున్నాం. అయినప్పటికీ సంస్థను తమ సొంతంగా భావించి దాని అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రద్దీని తట్టుకుంటూ విధులు నిర్వహిస్తున్నాం. మా డిపో మేనేజర్ సూచనలతో ఇబ్బందులు లేకుండా పని చేస్తున్నాం.

పనిభారం ఉన్నా సమర్థంగా విధులు



- రజిత, ట్రాఫిక్ ఎస్టీఐ, తొర్రూరు డిపో

ఆర్టీసీ బస్సుల్లో మహిళా ప్రయాణికుల సంఖ్య విపరీతంగా పెరిగింది. దీంతో మహిళా కండక్టర్లు ఒత్తిడికి గురవుతున్నారు. పని భారం పెరుగుతున్నా సమర్థంగా విధులు నిర్వహిస్తున్నారు. వారికి కేటాయించిన టార్గెట్ పూర్తి చేస్తున్నారు. సంస్థ లాభాల్లో వారి కృషి కీలకం.



త్రివేణి సంగమం

● మరో 8 నెలల్లో

సరస్వతి పుష్కరాలు

● ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేస్తే మేలు

న్యూస్‌టుడే, కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వర క్షేత్రం వద్ద అంతర్వాహినిగా పేరున్న సరస్వతి నదికి మరో ఎనిమిది నెలల్లో పుష్కరాలు రానున్నాయి. ప్రతి పన్నెండేళ్లకోసారి వచ్చే సరస్వతి పుష్కరాలు వచ్చే ఏడాది మే 15 నుంచి 26 వరకు జరుగుతాయి. 2013లో ఈ నదికి పుష్కరాలు జరిగాయి. కాళేశ్వరం క్షేత్రంలో మూడు నదులు కలుస్తాయి. దీన్ని త్రివేణి సంగమంగా పిలుస్తారు. ఎగువ నుంచి గోదావరి, మహారాష్ట్ర నుంచి ప్రాణహిత నదుల ప్రవాహం రాగా కాళేశ్వరాలయంలోని ద్విలింగాలకు జలాభిషేకం చేసిన నీరు అంతర్వాహినిగా రెండు నదుల్లో కలుస్తుందని పురాణాల్లో ఉంది. 2015లో గోదావరి, 2022లో ప్రాణహిత పుష్కరాలు జరిగాయి. మరోనది సరస్వతికి పుష్కర కాలం సమీపించింది. గతంలో జరిగిన సరస్వతి పుష్కరాల్లో గోదావరి, ప్రాణహిత కలయిక ప్రవాహంలో లక్షల మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. ఈసారి మరో 8 నెలల సమయమే ఉన్నందున అటు దేవస్థానం అధికారులు, ఇటు ఇతర అధికారులు ముందస్తు ప్రణాళికలు, ప్రతిపాదనలు సిద్ధం చేసుకుంటే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించొచ్చు.

పూర్తి చేయాల్సిన పనులు..



అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం

- గత ఎనిమిదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న 100 గదుల విశ్రాంతి భవన నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. నిధుల లేమితో నిర్మాణాలు ఆగిపోగా పంచాయతీరాజ్ అధికారులు గతేడాది అక్టోబర్‌లో మరో రూ.1.5 కోట్ల కోసం జిల్లా పాలనాధికారికి లేఖ పంపించారు. ఇది అందుబాటులోకి వస్తే భక్తులకు సౌకర్యంగా ఉంటుంది.
- 2013 సరస్వతి పుష్కరాల సమయంలో ప్రయాణ ప్రాంగణం నుంచి గోదావరి వరకు ప్రధాన రహదారిని విస్తరించాలని నిర్ణయించారు. ప్రాణహిత పుష్కరాలకు ముందు ఏర్పాట్లు జరిగినా కొందరు అడ్డు తగలడంతో ఆగిపోయింది. మంత్రి శ్రీధర్‌బాబు చొరవ తీసుకుంటే విస్తరణ పనులు సకాలంలో పూర్తయి భక్తుల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడదు. మంత్రి శ్రీధర్‌బాబు కాళేశ్వర క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని పలుమార్లు హామీలిచ్చారు. పుష్కరాల నేపథ్యంలో అధికారులు వెంటనే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక నివేదించాలి. తదనుగుణంగా సకాలంలో పనులను పూర్తి చేయడానికి వీలు కలుగుతుంది.
- ప్రముఖుల ఘాట్ వద్ద అంతర్వాహిణిగా సరస్వతి నది ప్రవహించి రెండు నదుల్లో కలుస్తుందని నానుడి ఉంది. ఆ ప్రాంతంలో పుష్కర ఘాట్ నిర్మాణాలు చేపట్టాలి.
- మండు వేసవిలో పుష్కరాలు రానుండగా భారీ సంఖ్యలో గోదావరి తీరంలో, ఆలయ పరిసర ప్రాంతాలలో చలువ పందిళ్ల ఏర్పాటు చేయాలి.
- ప్రధాన ఆలయానికి సమీపంలోని గుండం చెరువును ఆధునికీకరిస్తామని పలుమార్లు నాయకులు చెబుతున్నా పనులు సాగడం లేదు. వెంటనే గుండం చెరువును మినీ ట్యాంక్‌బండ్ మాదిరిగా నిర్మాణాలు చేపట్టాలి.

విస్తృత ప్రచారం జరగాలి

సరస్వతి నది పుష్కరాలపై దేవస్థానం అధికారులు విస్తృత ప్రచారం చేపట్టాల్సి ఉంది. దేశం నలుమూలల తెలిసేలా వివిధ ప్రసార మాధ్యమాల ద్వారా ప్రచారం జరగాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు. గత మంగళవారం పుష్కర ఏర్పాట్లపై దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజరామయ్యర్, కమిషనర్ హన్మంతరావు సమీక్ష నిర్వహించారు. ఈ నేపథ్యంలో పనుల పురోగతిపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. 2013లో జరిగిన సరస్వతి పుష్కరాలకు మొదటి నాలుగు రోజులు భక్తుల సంఖ్య కేవలం వందకు పరిమితం కాగా అయిదో రోజు నుంచి పుంజుకొని వేల మంది భక్తులు పుణ్యస్నానాలు చేశారు. రాబోయే పుష్కరాలపై ఇప్పటి నుంచే ప్రచారం చేయాల్సిన అవసరం ఉంది.

ఒత్తిడి తట్టుకోలేక యువకుడి ఆత్మహత్య



సాకేత్ (పాతచిత్రం)

నెల్లికుదురు, న్యూస్‌టుడే: ఉద్యోగం చేస్తూ తమకు ఆసరాగా ఉంటాడనుకునే కొడుకు ఒత్తిడి తట్టుకోలేక బలవన్మరణం చెందడం ఆ తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిల్చింది. నెల్లికుదురు ఎస్సై సీహెచ్.రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు..మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురుకు చెందిన బచ్చు విజయ, శంకర్ దంపతుల పెద్ద కుమారుడు సాకేత్(22) ఇంజినీరింగ్ విద్య పూర్తి చేసి హైదరాబాద్‌లోని ఓ సంస్థలో ఉద్యోగం చేస్తున్నారు. తల్లిదండ్రులు కిరాణం దుకాణం నిర్వహిస్తూ కుమారుడ్ని ఉన్నత విద్య చదివించారు. కొన్ని రోజులు ఇంటినుంచే విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగంలో ఒత్తిడి ఉంటుందని తరచూ తన స్నేహితులతో చెప్పేవారు. గత జులై నుంచి ప్రతి శుక్రవారం హైదరాబాద్‌లోని కార్యాలయానికి వెళ్లి వస్తున్నారు. ఈ శుక్రవారం కూడా వెళ్లాల్సి ఉందని తల్లిదండ్రులకు తెలిపి నిద్రపోయారు. కాగా, ఉద్యోగ జీవితంలో ఎదురవుతున్న ఒత్తిడిని తట్టుకోలేక గురువారం అర్ధరాత్రి ఇంట్లో గాలి పంకకు చీరతో ఉరి వేసుకొన్నాడు. శుక్రవారం తెల్లవారుజామున తల్లిదండ్రులు కుమారుడ్ని చూసేటప్పటికీ మృతి చెంది ఉన్నాడు. వారు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం చేరవేశారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమేష్‌బాబు వివరించారు.

ముగ్గురు న్యాయమూర్తులకు పదోన్నతి

వరంగల్ న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ముగ్గురు జూనియర్ సివిల్ జడ్జిలకు సీనియర్ సివిల్ జడ్జిలుగా పదోన్నతి లభించింది. వరంగల్ జిల్లా నర్సంపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి పి.శిరీష పదోన్నతిపై సికింద్రాబాద్ సిటీ సివిల్ న్యాయస్థాన ప్రాంగణంలోని 14వ అదనపు కోర్టు జడ్జిగా వెళ్తున్నారు. ములుగు జిల్లా ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి డి.రామ్మోహన్‌రెడ్డి మంచిర్యాల జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై వెళ్తున్నారు. జనగామ సీనియర్ సివిల్ జడ్జి సి.విక్రం అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో జనగామ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత పదోన్నతిపై వస్తున్నారు. వరంగల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.సాయికుమార్ అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఆయన స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎ.ప్రదీప్ పదోన్నతిపై వస్తున్నారు. హనుమకొండ జిల్లా ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి క్షమాదేశ్ పాండే అదే జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శిగా వెళ్తున్నారు. ఆమె స్థానంలో హనుమకొండ మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జి జాబిశెట్టి ఉపేందర్‌రావు వస్తున్నారు. రంగారెడ్డి ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి వి.ఉషాక్రాంతి పదోన్నతిపై హనుమకొండ జిల్లా మొదటి అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా వస్తున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి సంపత్‌రావు చందన హనుమకొండ జిల్లా రెండో అదనపు సీనియర్ సివిల్ జడ్జిగా నియమితులయ్యారు.

కాంగ్రెస్ సీనియర్ నేత నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత



మరిపెడ, న్యూస్‌టుడే: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి (73) శుక్రవారం కన్నుమూశారు. మరిపెడ మండలం పురుషోత్తమయాగూడెం గ్రామానికి చెందిన నరేశ్‌రెడ్డి వారం రోజుల క్రితం గుండె సంబంధిత సమస్యతో హైదరాబాద్ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. డోర్నకల్ శాసనసభ నియోజకవర్గంలో క్రియాశీల రాజకీయాల్లో ఉంటూ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌కు ప్రధాన ప్రత్యర్థిగా రాజకీయాల్లో కొనసాగారు. తెలంగాణ ఉద్యమ సమయంలో భారాసలో చేరారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

● పురుషోత్తమాయగూడెంలోని ఏరువాక వ్యవసాయ క్షేత్రంలో నరేష్‌రెడ్డి అంత్యక్రియలు శనివారం నిర్వహించనున్నారు. డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్, జిల్లా ఎస్పీ రాంనాథ్ కేకన్ అంత్యక్రియల ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయన మృతి పట్ల ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ నేతలు సంతాపం ప్రకటించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	114
రిటైల్:	136
డ్రెస్డ్:	197
స్కిన్‌లెస్:	224

కవుల రాగమై .. జీవన గానమై..!

● బతుకమ్మ పాటల్లో గొప్ప సందేశం

ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా పూలను పూజించే అత్యంత పవిత్రమైన పండగ బతుకమ్మ. మహిళలంతా రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలను పూజిస్తూ.. ఆటపాటలతో మురిసిపోతారు. ఆ పాటల వెనుక ఎంతో అర్థముంది. ఇవి జానపదాలతో పాటు కవులు, గాయకుల కలం నుంచి జాలువారి ప్రజలను అలరిస్తున్నాయి.. పాటల చరణాల్లోని బావుకత, పూల సొగసుల వర్ణన, జీవన పరమార్థం, ప్రకృతి దేవతల ఆరాధన, సందేశాలు.. ఇలా ఎన్నో దాగి ఉన్నాయి.. మానుకోట, న్యూస్‌టుడే



హనుమకొండ భీమారంలోని ఎస్సార్ విశ్వవిద్యాలయంలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు, అధ్యాపకులు

ఆప్యాయత..

మా ఇంటి ఆడపడుచువు
అమ్మా.. ఓ బతుకమ్మా
మా పల్లె పూల జల్లువు
అమ్మా.. బతుకమ్మా..
తెలంగాణ మురిసె..
మా చెల్లెలంతా.. మా అక్కలంతా.. మా అమ్మలంతా
బతుకమ్మలాడా..'



- మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రజాగాయకుడు, వాగ్గేయకారుడు గొడిశాల జయరాజు ఈ పాట రాశారు.

● తన పాటలో బతుకమ్మ వేడుకల వేళ ఆడపడుచుల ఆనందాన్ని.. పూల పర్వదిన సౌందర్యాన్ని వర్ణించారు.

పూల తహతహ..!

'బతుకమ్మ పండగొస్తే
పూవులన్నీ నవ్వుతాయి..
గడ్డిపూలు గంతులేస్తయ్.. తంగేడు
పూలు తెంపమంటయ్
నునుపుగున్న గునుగు పూలు
గుసగుసలు చెబుతాయి
చెరువులోని తామరలు
తెంపమంటూ తొంగుతాయి
బతుకమ్మ పండుగొస్తెరా.. మా పల్లె తల్లి
పుత్తడి బొమ్మయి పోవురా..
నా తెలంగాణ తల్లి పుత్తడి బొమ్మయి పోవురా..



మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన గాయకుడు, గేయ రచయిత కందుల ప్రేంకుమార్ ఈ పాట రాశారు.

● ప్రకృతిలోని రంగు రంగుల పూలు బతుకమ్మలో తమను కూడా చేర్చాలని.. పేర్చాలని.. కోరుకుంటాయని ప్రేంకుమార్ పూల తహతహలను వర్ణించారు. ఒక్కో పువ్వును వర్ణించారు.

ఊరూవాడ కలిసేలా..



'సింగిడిలో.. సింగిడిలో
రంగులన్నీ నేలకొచ్చేనా..
రంగు రంగు పువ్వులయి
ఏకమయ్యేనా.. చెరువంతా
మెరిసేనా..
ఊరువాడా కలిసి.. బతుకమ్మలా పేర్చి
ముత్తయిదువులంతా కలిసి గౌరమ్మను కొలిసెనే..
అందాల పూవులన్నీ ఊయలలూగెనా
మందార పూలన్నీ కోలాటమాడెనా
తామర పువ్వులన్నీ తనువు తడిసెనా
గులాబీ పువ్వులన్నీ పొద్దయిపొడిసెనా
ఊరువాడా కలిసి మొక్కులన్నీ తీర్చి..

● మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు, గాయకుడు అక్షరం ప్రభాకర్ బతుకుతెరువునిచ్చే బతుకమ్మ అంటూ పాటలు రాశారు. నింగిలోని ఇంద్రధనుస్సు బతుకమ్మను చూడడానికి ఒక్కొక్క పూవుగా నేలకు వచ్చినట్లు ఈ పాటలో వివరించారు. పండగ వేళ ఊరంతా ఎలా ఆనందంలో తేలిపోతారో తెలియజేశారు.

సామూహిక అత్యాచార నిందితుల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ నందిరాంనాయక్

మట్టెవాడ, న్యూస్‌టుడే: వరంగల్ నగరంలో యువతిపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు యువకులను ఇంతేజార్‌గంజ్ ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్ అరెస్టు వివరాలు వెల్లడించారు. భూపాలపల్లి హనుమాన్‌నగర్‌కు చెందిన తాటి శివరాజ్ కుమార్, పుట్టపాక శరత్ స్నేహితులు. శరత్ ద్వారా బాధిత యువతి మూడు సంవత్సరాల క్రితం శివరాజ్‌కుమార్‌కు పరిచయమైంది. నర్సంపేట లక్నేపల్లిలోని బాలాజీ ఇంజినీరింగ్ కళాశాలలో శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కొడం వివేక్ బీటెక్ చదువుతున్నారు. ప్రధాన నిందితుడు శివరాజ్‌కుమార్, గోదావరిఖనికి చెందిన కూచన మణిదీప్ కుటుంబాల మధ్య స్నేహం ఉంది. ఈక్రమంలో శివరాజ్‌కుమార్ ఇటీవల బాధిత యువతికి తన ప్రేమ విషయాన్ని తెలుపగా ఆమె నిరాకరించి స్నేహితులుగా ఉందామని చెప్పింది. దీంతో యువతిని ఎలాగైనా శారీరకంగా లోబరుచుకోవాలని శివరాజ్‌కుమార్ ఆలోచించాడు. గత నెల 15న శివకుమార్, వివేక్‌లను కలవడానికి మణిదీప్ బిట్స్ కళాశాలకు వచ్చాడు. ముగ్గురు కలిసి ఉండగా శివకుమార్ తన కోరికను వెలిబుచ్చాడు. దీంతో ముగ్గురు కలిసి నగర శివారులో యువతి చదువుతున్న కళాశాలకు వచ్చారు. బాధిత యువతికి శివరాజ్‌కుమార్ ఫోన్ చేసి గుడికి వెళ్దామని చెప్పి కారులో ఎక్కించుకున్నారు. అప్పటికే కారులో మరో ఇద్దరు యువకులు మణిదీప్, వివేక్‌లను చూసి గుడికి వచ్చేందుకు నిరాకరించింది. దీంతో ఆమెను బలవంతంగా ఎక్కించుకున్నారు. వరంగల్ పోచమ్మ మైదాన్‌లోని ఓ మద్యం దుకాణంలో బీర్లు కొనుగోలు చేశారు. అక్కడి నుంచి వరంగల్ కూరగాయల మార్కెట్ వద్ద గల ఓ లాడ్జికి తీసుకెళ్లారు. యువతికి మద్యం తాగించి లాడ్జిలో ఒకరి తర్వాత ఒకరు అత్యాచారానికి పాల్పడ్డారు. యువతి అరుపులతో లాడ్జి సిబ్బంది వచ్చి ప్రశ్నించగా గది నుంచి యువతి, ముగ్గురు యువకులు వెళ్లిపోయారు. అత్యాచారం విషయాన్ని ఎవరికైనా చెబితే చంపేస్తామని ఆమెను బెదిరించారు. కళాశాలలో పరీక్షల అనంతరం ఇంటికి వెళ్లిన యువతి అత్యాచారం విషయాన్ని తల్లికి చెప్పగా ఈ నెల 1న ఇంతేజార్‌గంజ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు సీఐ మచ్చ శివకుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు. గురువారం నర్సంపేట మహేశ్వరం వెళ్లే ఓ కచ్చా రోడ్డు వద్ద ముగ్గురు యువకులను అరెస్టు చేశారు. మణిదీప్‌కు చెందిన కారు, మూడు చరవాణులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

పథకాల అమలుకు చర్యలు తీసుకోండి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అధికారులు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎంపీ బలరాంనాయక్, ఎమ్మెల్యే మురళీనాయక్ శుక్రవారం కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్‌ను కలిసి చర్చించారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులు ఇంకా చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందేవిధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

ప్రభుత్వ ఆదేశాలు పాటించాలి

కొత్తగూడ, న్యూస్‌టుడే: వరి కొనుగోళ్లలో ప్రభుత్వ ఆదేశాలు పాటించాలని జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల పేర్కొన్నారు. శుక్రవారం కొత్తగూడ రైతువేదికలో కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాలకు చెందిన ఏఈవోలకు నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాల మేరకు సన్నరకం, దొడ్డురకం ధాన్యం నిర్ధారణ చేయాలని సూచించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం రకాన్ని గుర్తించలేకపోతే ప్రభుత్వం ఇచ్చిన కొలతల మేరకు ఆ ధాన్యాన్ని ఏ రకానికి చెందినదని గుర్తించవచ్చన్నారు. అంతకుముందు గ్రామంలో నిర్వహించిన పంటల నమోదు కార్యక్రమాన్ని డీఏవో పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఏడీఏ శ్రీనివాసరావు, కొత్తగూడ, గూడూరు ఏవోలు ఉదయ్, మాలిక్, కొత్తగూడ, గంగారం, గూడూరు మండలాల ఏఈవోలు పాల్గొన్నారు.

8న జాబ్‌మేళా

గార్ల, బయ్యారం, కొత్తగూడ న్యూస్‌టుడే: మహబూబాబాద్‌లో ఈ నెల 8న నిర్వహించనున్న జాబ్‌మేళాను అర్హులైన నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని గార్ల, బయ్యారం, కొత్తగూడ మండలాల్లో ఆయా ఠాణాల పోలీసు అధికారులు ప్రచారం నిర్వహించారు. పది, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్, ఫార్మసీ విద్యార్హతలకు తగిన ఉద్యోగావకాశాలున్నట్లు వెల్లడించారు. ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ,యువకులు ఈ నెల 8లోగా గార్ల ఠాణాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. 40కి పైగా సంస్థలు 2000కు పైగా ఉద్యోగావకాశాలున్నట్లు వివరించారు.

దారి చూపితేనే కష్టాలు దూరం

సిగ్నల్‌కాలనీ - డంపింగ్ యార్డు రోడ్డుపై స్థానికులు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కాలనీ నుంచి డంపింగ్ యార్డుకు వెళ్లేందుకు నిర్మాణం చేయనున్న రహదారి పనులను అడుగడుగున అడ్డంకులు ఎదురవుతున్నాయి. పురపాలక సంఘం నుంచి మంజూరైన నిధులతో చేపట్టిన పనులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తుండగా రైల్వే మూడో లైన్ విస్తరణ పనుల కోసం ఆ శాఖ అధికారులు భారీ యంత్రాలతో ఉన్న వాహనాలను ఈ రహదారిపై నడిపించడంతో పలు ప్రాంతాల్లో గుంతలు పడ్డాయి. ఇదే సమయంలో భారీ వర్షాలతో ఎగువ ప్రాంతాల్లో ఉన్న చెరువులు, కుంటల నుంచి వరద నీరు రావడంతో ఆ గుంతల్లో నీరు చేరడంతో గాక వరద నీటితో సుమారు ఐదు వందల మీటర్లపైగా రహదారి కొట్టుకుపోయింది. ఈ రోడ్డును పునర్నిర్మాణం చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వివిధ కాలనీవాసులు కోరుతున్నారు. కొన్ని రోజులుగా రహదారి నిర్మాణ పనులు నిలిపివేయడంతో రాకపోకలకు అవస్థలు పడాల్సి వస్తుందని మండకొమ్మర, సిగ్నల్‌కాలనీ, సోనియానగర్ కాలనీ, భూపతిసత్యనాలనీ, మాధవన్నకాలనీ ప్రాంతవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

☛ వరదలతో కొట్టుకుపోయిన రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలంటూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించామని పురపాలక కమిషనర్ రవీందర్, డీఈ ఉపేందర్ తెలిపారు. ఇప్పటికే మంజూరైన నిధులతో పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



డంపింగ్ యార్డు వెళ్లే రహదారి నిర్మాణం త్వరగా పూర్తి చేయాలని కోరుతున్న కాలనీవాసులు

వర్షాలతో మరింత కొట్టుకుపోయింది

సిగ్నల్ కాలనీ నుంచి డంపింగ్ యార్డు వద్దకు వెళ్లే కంకర, డాంబర్ రోడ్డు వర్షాలతో వచ్చిన వరదల్లో ఇంకా బాగా కొట్టుకుపోయింది. అంతకు ముందే ఈ రోడ్డు కంకర తేలి ఇబ్బందిగా ఉంది అంటే వరదల వల్ల దెబ్బతిన్న ఈ రహదారిని బాగా చేయాలి.

రోడ్డు లేక అవస్థలు

- రావుల రాధమ్మ, మండకొమ్మర్ళ కాలనీ

ఏళ్ల కాలంగా మా కాలనీకు సరైన రోడ్డు లేక అవస్థలు పడుతున్నాం. నాలుగైదు కాలనీల నుంచి పలువురు మంది పనులకు ఈ రోడ్డు పైనే వెళ్లి వస్తుంటారు. కంకరతేలి గుంతలు పడిన ఈ రహదారిపై వెళ్లాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762, మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 9701914499, డోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823


మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: వేపంమార్కెట్ - ఆర్టీసీ బస్టాండ్ ప్రధానవీధిలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. - రమేశ్

శునకాలను నిర్జన ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకుంటాం. - తోట రాజేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లోని అంబేడ్కర్ నగర్‌లోని కాలువలో మురుగు పేరుకుపోయింది. సమస్య పరిష్కరించాలి. - శంకర్

శుభ్రం చేయిస్తాం - అహ్మద్, హెల్త్ ఇన్‌స్పెక్టర్, డోర్నకల్

వీధి దీపం ఏర్పాటు



డోర్నకల్, న్యూస్‌టుడే: అమ్మపాలెంలోని అంతర్గత వీధిలో శుక్రవారం దీపం ఏర్పాటు చేశారు. దీపం వెలగడం లేదని స్థానికుడు రమేష్ 'మేమున్నాం.. మీకు తోడుగా' కు నివేదించగా సమస్య పరిష్కరించారు.

పిచ్చి మొక్కల తొలగింపు

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: కేంద్రీయ విద్యాలయం వెనుక వీధిలో విద్యుత్తు తీగలకు అల్లుకున్న పిచ్చి మొక్కలు తొలగించాలని సెప్టెంబర్ 19వ తేదీ గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు విద్యుత్తు శాఖ లైన్‌మెన్ సురేష్ స్పందించారు. సిబ్బందితో పిచ్చి మొక్కలు, చెట్ల కొమ్మలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

ఝాన్సీరెడ్డి కోలుకోవాలని ప్రత్యేక పూజలు



తొర్రూరు, న్యూస్‌టుడే: ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో జరిగిన ప్రమాదంలో పాలకుర్తి కాంగ్రెస్ ఇన్‌ఛార్జి ఝాన్సీరెడ్డి కాలు విరగడంతో, చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో ఆమె త్వరగా కోలుకోవాలని కోరుతూ పార్టీ తొర్రూరు నాయకులు శుక్రవారం స్థానికంగా ఉన్న భద్రకాళి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు సోమరాజశేఖర్ ఆధ్వర్యంలో 108 కొబ్బరికాయలు కొట్టారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సంతోష్, మున్సిపల్ వైస్ చైర్మన్ రామచంద్రయ్య, నాయకులు అచ్చిరెడ్డి, శంకర్, భిక్షంగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్య శిబిరం



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి మురళీధర్

తొర్రూరు, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు, వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జి.మురళీధర్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని లయన్స్ భవనంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై స్థానిక సీఐ జగదీష్‌తో కలిసి ఆయన మాట్లాడారు. వైద్యశిబిరాలతో ప్రజలకు వ్యాధులపై మరింత అవగాహన కలిగి అప్రమత్తంగా ఉంటారన్నారు. 382 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి నవీన్‌కుమార్, రమేష్, శంకర్, రాజేందర్‌రెడ్డి, లక్ష్మీనరసింహారావు, వెంకట్‌రెడ్డి, శారద, విశ్వేశ్వరరావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులతోనే దిగుబడులు

మామునూరు, న్యూస్‌టుడే: మిరపలో విత్తన ఎంపిక కాదు.. మేలైన యాజమాన్య పద్ధతులను పాటిస్తేనే దిగుబడులు వస్తాయని బెంగళూరు భారత ఉద్యాన పరిశోధన సంస్థ (ఐఐహెచ్ఆర్) సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సురేశ్ పొన్నం సూచించారు. శుక్రవారం మల్యాల జేవీఆర్ ఉద్యాన పరిశోధన కేంద్రం ఆధ్వర్యంలో గిరిజన ఉప ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా 'మిరపసాగులో మేలైన వ్యవసాయ పద్ధతులు'పై రైతు వేదికలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మిరప పంటకు ప్రధాన సమస్యలైన ఆకుముడత, నల్లతామర పురుగుల నివారణకు పంట ప్రారంభం నుంచే తీసుకోవాల్సిన పలు జాగ్రత్తలను వివరించారు. పురుగు మందుల పిచికారీని రైతులు సామూహికంగా చేపడితే ప్రయోజనం ఉంటుందన్నారు. మిరప కోతల అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ సందర్భంగా రైతులకు సూక్ష్మపోషక మిశ్రమాలు, వేప కషాయం పొడి, జీవన ఎరువులు, విత్తనాలను పంపిణీ చేశారు. ఐఐహెచ్ఆర్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ టి.హటియాసింగ్, జేవీఆర్ హెచ్ఆర్ఎస్ అధిపతి కె.నాగరాజు, అసోసియేట్ డీన్ డాక్టర్ చీనానాయక్, జిల్లా ఉద్యానశాఖ అధికారి మరియన్న, కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త రాంబాబు, ఏఈఓ సరిత పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న శాస్త్రవేత్త సురేశ్

కేవీపీఎస్ జెండా ఆవిష్కరణ

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: కేవీపీఎస్ ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలోని 20వ వార్డు పత్తిపాకలో గిరిజన సంఘం కేవీపీఎస్ జిల్లా కమిటీ బాధ్యుల ఆధ్వర్యంలో సంఘం నూతన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా కేవీపీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి దుడ్డెల రామ్మూర్తి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బానోతు వెంకన్న హాజరై సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మహాత్మాగాంధీ ఇచ్చిన స్ఫూర్తితో 1998 అక్టోబర్ 2న గాంధీజయంతి సందర్భంగా ఆత్మగౌరవం సమానత్వం కుల నిర్మూలనే లక్ష్యంగా కేవీపీఎస్ ఏర్పడిందన్నారు. మందుల మహేందర్, అలువాల ఆనంద్, ఎర్ర శ్రీనివాస్, పరమేశ్, పులిపాక నాగరాజు, గద్దల కృష్ణ, రత్నం, నాగభూషణం, గుర్రాల చరణ్ తదితరులున్నారు.

ప్రయాణం ప్రమాదకరం



నెల రోజుల కిందట కురిసిన వర్షానికి యర్రల చ్చయ్యగూడెం(బంజర) నుంచి ధన్‌సింగ్‌తండా, గోల్‌తండా, పెద్దనాగారం, ముంగిమడుగుకు వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టు వద్ద కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారింది. వాహనదారులు అదుపు తప్పి గుంతలో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, నర్సింహులపేట (డోర్నకల్)

కర్ర పుల్లలు కాదు.. హరితహారం మొక్కలే...!



మండలంలోని కుమ్మరికుంట్ల బస్టాండ్ నుంచి గున్నేపల్లి వరకు హరితహారంలో భాగంగా మొక్కలు సంరక్షణ కరవై వాడిపోయాయి. కొత్తగా నిర్మిస్తున్న బీటీ రోడ్డుకు రెండువైపులా మొక్కలు నాటాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యం, ఉపాధి హామీ సిబ్బంది బాధ్యతారాహిత్యంతో కేవలం ఒక్క వైపునే సుమారు వంద మొక్కలు నాటి వదిలేశారు. నాటిన మొక్కల చుట్టూ జాలీలు లేదా ముళ్లకంచెలు ఏర్పాటు చేయాల్సి ఉన్నా దానిని విస్మరించినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. మొక్కలను పట్టించుకోకపోవడంతో కొన్ని ఎండిపోగా మిగతావి పశువులు తినడంతో కర్ర పుల్లల్లా మారాయి.
- న్యూస్‌టుడే, దంతాలపల్లి (డోర్నకల్)

కంకర వేశారు.. తారు మరిచారు



మండలంలోని గోపాలపురం పంచాయతీ పరిధిలోని ఢాక్యాతండాకు రహదారి సౌకర్యంలో భాగంగా బీటీ రోడ్డు నిర్మాణానికి కంకర పరచి రోడ్డును వదిలేయడంతో బాటసారులకు కష్టాలు తప్పడం లేదు. ఏడాది కింట డీఎంఎఫ్‌టీ నిధులు రూ.కోటితో కిలోమీటరుమేర బీటీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. గుత్తేదారు రోడ్డును చదునుచేసి కంకరపోసి వదిలేశారు. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఏఈ నవీన్‌కుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సత్వర చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. - న్యూస్‌టుడే, గార్ల (కొత్తగూడ)

ఆసుపత్రి పరిసరాలను శుభ్రం చేయాలి

డోర్నకల్, న్యూస్‌టుడే: డోర్నకల్‌లోని ప్రభుత్వ ఆసుపత్రి పరిశుభ్రతపై మున్సిపాలిటీకి ఏ మాత్రం పట్టింపు లేదని భాజపా జిల్లా అధ్యక్షుడు వైవీ రావు పేర్కొన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి వైద్యాధికారి డా.సాద్వీజతో మాట్లాడారు. పలు విషయాలపై ఆరా తీశారు. రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తున్నట్లు తమకు తెలిసిందన్నారు. ఈ సందర్భంగా డా.సాద్వీజను సన్మానించారు. పరిసరాల పరిశుభ్రత పాటించడంలో పుర పాలకవర్గం విఫలమైందని ధ్వజమెత్తారు. కలెక్టర్‌కు సమస్యలను నివేదిస్తామని తెలిపారు. భాజపా మండలాధ్యక్షుడు గణేష్, పట్టణాధ్యక్షుడు దేవ, లక్ష్మీనారాయణ, గఫూర్, సుమన్, రాంబాబు ఉన్నారు

ఉదయ్‌చందర్ కుటుంబానికి పరామర్శ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు చుక్కల ఉదయ్‌చందర్ కుటుంబాన్ని మాజీ ఎంపీ, భారాస జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత శుక్రవారం పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడారు. భారాస నాయకులు పర్కాల శ్రీనివాసరెడ్డి, ముత్యం వెంకన్న, పాషా ఉన్నారు.

నరేష్‌రెడ్డి మృతి తీరని లోటు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: సీనియర్ రాజకీయ నేత నూకల నరేష్‌రెడ్డి మృతి తీరని లోటని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. అన్ని వర్గాలను కలుపుకొని పోయే నరేష్‌రెడ్డి మరణవార్త తనను ఎంతో కలిచివేసిందన్నారు. నూకల నరేష్‌రెడ్డి ఆకస్మిక మృతి బాధాకరమని తెదేపా మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.రామచందర్‌రావు ఒక ప్రకటనతో విచారం వ్యక్తం చేశారు.

సీజీఆర్ఎఫ్ సభ్యుడిగా రామారావు



డోర్నకల్, న్యూస్‌టుడే: వినియోగదారుల ఫిర్యాదు పరిష్కార వేదిక (కన్స్యూమర్ గ్రీవెన్స్ రీడ్రెసెల్ ఫోరం-సీజీఆర్ఎఫ్)-1లో సభ్యుడిగా డోర్నకల్ మండలం అమ్మపాలెం గ్రామానికి చెందిన మంధనపు రామారావు నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ ఉత్తర్వులు వెలువరించారు. అపరిష్కృతంగా ఉన్న విద్యుత్తు సమస్యలు పరిష్కరించడంతో పాటు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల రైతులకు అందుబాటులో ఉంటానని రామారావు శుక్రవారం విలేకరులకు తెలిపారు

కల్వల పంచాయతీలో సీఈవో తనిఖీ

కేసముద్రం, న్యూస్‌టుడే: కల్వల పంచాయతీలో శుక్రవారం జడ్పీ సీఈవో నర్మద తనిఖీ చేశారు. అభివృద్ధి పనులు, నర్సరీ పనితీరును పరిశీలించారు. ఆరోగ్య ఉప కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి విద్యార్థుల వివరాలు తెలుసుకున్నారు. ఎంపీడీవో ఉదయశ్రీ , ఎంపీవో హరిప్రసాద్, పంచాయతీ కార్యదర్శి అరుణజ్యోతి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై చైతన్యం



డోర్నకల్, న్యూస్‌టుడే: గొల్లచర్లలో అగ్ని ప్రమాదాల నివారణపై డోర్నకల్ అగ్నిమాపక సిబ్బంది శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రధానంగా దుర్గామాత మండపాల వద్ద కార్యక్రమం చేపట్టారు. నిర్వాహకులకు పలు జాగ్రత్తలు తెలిపారు. అగ్నిమాపక అధికారి వీరేష్, సిబ్బంది చంద్రమౌళి, శ్రీనివాస్, ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఏకగ్రీవ ఎన్నిక

నర్సింహులపేట, న్యూస్‌టుడే: పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ఉపాధ్యక్షులుగా నర్సింహులపేట మండలానికి చెందిన నలుగురు ఉపాధ్యాయులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆ సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు పూర్ణచందర్, కొండా సంజీవా శుక్రవారం పేర్కొన్నారు. జిల్లా ఉపాధ్యక్షులుగా కొండం నరసింహారెడ్డి, నట్టే శేఖర్, వడ్లకొండ వీరేందర్, గొట్టిముక్కుల మోహన్‌రెడ్డిలను ఆదివారం మహబూబాబాద్‌లో జరిగిన జిల్లా కమిటీ ఎన్నికల్లో జిల్లా అధ్యక్ష, కార్యదర్శుల బద్రినారాయణ, సతీష్‌రెడ్డి సమక్షంలో ఎన్నుకున్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మాజీ సర్పంచి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మండలంలోని అయోధ్య గ్రామ మాజీ సర్పంచి భారాస నేత కోల సత్యం ఆ పార్టీకి రాజీనామా చేసి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ సత్యానికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్గ రాజకీయాలు చేయకుండా పాత, కొత్తవారు కలిసి ఉండాలన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఎం.రామిరెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు జి.రవీందర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

కురవి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడిన సంఘటన కురవి మండలం అయ్యగారిపల్లిలో శుక్రవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని కందికొండకు చెందిన పర్శబోయిన భిక్షపతి ద్విచక్ర వాహనంపై మహబూబాబాద్‌కు వెళ్తుండగా మరిపెడ నుంచి వస్తున్న కారు అయ్యగారిపల్లిలో ఢీకొట్టింది. బాధితుడిని కురవి పోలీసులు 108 లో మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కూలీ ధరలు పెంచాలని ధర్నా

మహబూబాబాద్, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్‌లో పని చేస్తున్న కూలీల ధరలు పెంచాలని కోరుతూ శుక్రవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ ఎదుట ధర్నా చేశారు. సీఐటీయూ అనుబంధ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.నాగన్న మాట్లాడారు. గొడుగు గట్టయ్య, జనార్దన్, వినయ్, ప్రవీణ్, కాంతమ్మ, నాగమ్మ పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత

గార్ల, న్యూస్‌టుడే: చంద్రగిరి, పెద్దకిష్టాపురం, అంజనాపురంలో శుక్రవారం షపర్డ్ స్వచ్ఛందసేవా సంస్థ సహాయంతో యువశక్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద గిరిజనులకు నిత్యావసరాలను అందజేశారు. భారీ వర్షాలతో నష్టపోయిన కుటుంబాలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జి.సక్రు తదితరులున్నారు.

ఎనిమిది కాళ్ల గొర్రెపిల్ల జననం

దంతాలపల్లి: ఎనిమిది కాళ్లతో వింత గొర్రెపిల్ల జన్మించిన సంఘటన దంతాలపల్లి శివారు రాజాతండాలో శుక్రవారం చోటు చేసుకుంది. తండాలోని ఓ వ్యక్తికి చెందిన గొర్రె గురువారం మొదటి ఈతలో ఎనిమిది కాళ్ల గొర్రెపిల్లకు జన్మించింది. పుట్టిన కొద్ది సేపటికే గొర్రెపిల్ల మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. ఎదుగుదల జన్యులోపం కారణంగా ఇలా జరిగి ఉంటుందని పేర్కొన్నారు.

విధుల్లో చేరిన ఎంపీడీవో

బయ్యారం, న్యూస్‌టుడే: బయ్యారం ఎమ్పీడీవోగా విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. బయ్యారం ఎమ్పీడీవోగా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. గార్ల మండలం నుంచి బదిలీపై వచ్చిన విజయలక్ష్మి మండల పరిషత్ కార్యాలయంలో విధుల్లో చేరారు.

నివేదికలు అందించండి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లాలో వివిధ శాఖల ద్వారా చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై పూర్తి వివరాలతో నివేదికలను అందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇంజినీరింగ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన రహదారులు, వంతెనలు, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై ఆయన సమీక్షించారు.

నిధులు కేటాయించాలని వినతి

మహబూబాబాద్, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మైదానం అభివృద్ధి, మౌలిక వసతులను కల్పించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ శుక్రవారం కాళోజీ వాకర్స్ ప్రతినిధులు ఎంపీ పోరిక బలరాంనాయక్‌కు వినతి పత్రం అందించారు. తనవంతుగా నిధులు మంజూరు చేస్తానని ఎంపీ వారికి హామీ ఇచ్చారు. అసోసియేషన్ ప్రతినిధులు డోలి సత్యనారాయణ, మైస శ్రీనివాస్, ఎన్.వెంకటరెడ్డి, విష్ణువర్ధన్, ఉపేందర్, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

గిర్మాజీపేట, న్యూస్‌టుడే: రైలు ప్రయాణికులే లక్ష్యంగా దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని వరంగల్ ప్రభుత్వ రైల్వే పోలీసులు అరెస్ట్ చేశారు. జీఆర్పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు రైల్వేస్టేషన్ రెండు, మూడు ప్లాట్‌ఫారాలపై తనిఖీలు నిర్వహిస్తుండగా.. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం పుట్టకోట బజార్‌కు చెందిన గొడుగు నవీన్ (21), ఖమ్మం జిల్లా ఏకునూరు మండలం రాజులపాలెం తండాకు చెందిన గుగులోతు నరేశ్ (25) అనుమానాస్పదంగా కనిపించారు. వారిని విచారించి.. తనిఖీ చేయగా రూ.3.50లక్షల విలువైన ఓ బంగారు గొలుసు, రెండు గాజులు, ఓ వెండి గ్లాసు, రెండు కుంకుమ భరిణలు లభించాయి. గత నెలలో వరంగల్ రైల్వేస్టేషన్‌లో సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ఆభరణాలను దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. వాటిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

చెట్ల నరికివేత

గూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని వెంగంపేట శివారులోని 365 జాతీయ రహదారి పక్కనే గల అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు చెట్లను నరికివేశారు. తుమ్మ, వేప మొదలైన చెట్లను గురువారం రాత్రి మద్యం తాగి అక్రమంగా నరికివేశారని గ్రామస్థులు తెలిపారు. గతంలో ఈ ప్రాంతంలో చెట్లను నరికివేయగా గ్రామస్థులు, అటవీశాఖ అధికారులు ఆక్రమణలకు గురి కాకుండా అడ్డుకున్నారు. మళ్లీ ఇదే చోట చెట్లను నరికివేయడంతో అటవీశాఖ అధికారులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. ఎఫ్ఆర్వో సురేష్‌ను మాట్లాడుతూ బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

క్షుద్ర పూజలకు యత్నం

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని లక్ష్మీపురం(బి) గ్రామంలోని వ్యవసాయ భూమిలో కొందరు రాత్రి సమయంలో క్షుద్రపూజలు చేయడానికి యత్నించగా స్థానికులు అడ్డుకున్న సంఘటన శుక్రవారం ఆలస్యంగా తెలిసింది. అమవాస్య రోజు గుర్తు తెలియని వ్యక్తులు గ్రామ సమీపంలో వ్యవసాయ బావుల వద్ద క్షుద్ర పూజలు చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్నారని స్థానికులు తెలిపారు.

ఉదయ్‌చందర్ కుటుంబానికి పరామర్శ

మహబూబాబాద్, న్యూస్‌టుడే: మహబూబాబాద్‌లో ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్‌చందర్ కుటుంబాన్ని ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యుడు జాటోత్ రామచంద్రునాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్ శుక్రవారం పరామర్శించారు. ముందుగా ఉదయ్‌చందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. క్రమశిక్షణ కలిగిన మంచి వ్యక్తిని కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. కుటుంబానికి అన్ని వేళలా అండగా ఉంటామన్నారు. కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ప్రభుత్వ విప్ జాటోత్ రామచంద్రునాయక్, ఎంపీ పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యే భూక్యా మురళీనాయక్

'డీఎస్సీ ఉద్యోగ నియామకాల్లో మాదిగలకు మోసం'

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: ఇటీవల వెలువడిన డీఎస్సీ ఉద్యోగ ఫలితాల్లో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పాటించకుండా ఉద్యోగ నియామకాలు చేపట్టడం మాదిగలకు మోసం చేశారని ఎమ్మెస్పీ జాతీయనాయకుడు గుగ్గిళ్ల పీరయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దుప్పెల్లి అనిల్‌కుమార్‌మాదిగ అన్నారు. మంద కృష్ణమాదిగ ఆదేశాల మేరకు శుక్రవారం పట్టణంలోని ఆఫీసర్స్ క్లబ్ ప్రాంగణంలో ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల జిల్లా కమిటీ నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. సుప్రీం కోర్టు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై ఆయా రాష్ట్రాలకు అధికారం ఇస్తూ తీర్పు ఇచ్చినా రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ అమలు చేయకుండా ఉద్యోగ నియామకాలు చేయడం మాదిగలను వంచించడమేనన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శాగంటి రమేశ్‌మాదిగ, ఎమ్మెస్పీ మహిళా జిల్లా అధ్యక్షురాలు కత్తుల రేణుక, ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు రజియా, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు పొలేపాక ప్రవీణ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి అబ్బూరి వినోద్‌రెడ్డి, వీహెచ్ పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పొలేపాక శంకర్, జిల్లా అధ్యక్షుడు చెలగొళ్ల వెంకన్న తదితరులున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్‌మాదిగ

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని వినతి

గూడూరు, న్యూస్‌టుడే: మండలంలోని అయోధ్యపురం గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు జిల్లా పంచాయతీ కార్యాలయం, మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో వినతి పత్రాలను అందజేశారు. ఈ నెల 2వ తేదీన జరిగిన గ్రామసభలో గ్రామ కార్యదర్శిని వివరాలు కోరగా గ్రామంలో చేపట్టిన పనుల తీర్మానాలను చదివి వినిపించారన్నారు. గత సర్పంచి చేయని పనులకు బిల్లు రికార్డు చేయించుకున్నట్లు తీర్మానాల ద్వారా తెలిసిందని వినతిలో పేర్కొన్నారు. పదవీ విరమణ జరిగి తొమ్మిది నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఎంబీ బుక్కులు, చెక్‌బుక్‌లను పంచాయతీ కార్యదర్శికి ఇవ్వలేదన్నారు. ప్రత్యేక అధికారి లేని కారణంగా గ్రామసభను 7వ తేదీకి వాయిదా వేశారన్నారు. పంచాయతీ నిధుల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మొగలగాని ప్రభాకర్, మాదాస్ రమేష్, పూజారి శంకర్, భీమగాని శ్రీనివాస్, భాజపా ఉపాధ్యక్షులు ముత్యం సురేష్ తదితరులు పాల్గొన్నారు.